# రకరకాల పక్షులు

## చిన్నారి పాఠకులకు ప్రకృతి కథలు



విద్యా, రాజారాం శర్మ

అనువాదం : కె. సురేష్

ఇతర కథలు:

రట్టు కాని గుట్టు

గుజ్జన గూళ్లు

గుడ్ల రహస్యం

గూళ్లు కట్టేవి, ఆక్రమించేవి

చెట్ల వెంట రెండు పసుపుపచ్చని పిట్టలు ఒక కాకిని తరుముతున్నాయి.

కాకిని ఆకాశంలోకి తరిమేసి అవి చెట్టుమీదకు తిరిగొచ్చాయి.

రెండూ ఆందోళనగా కనిపించాయి. చుట్టుపక్కల చూస్తూ అవి అరవసాగాయి.

ఇటువంటి పక్షులను నేను అంతకుముందు చూడలేదు. వాటిల్లో ఒకటి





మెరిసే పసుపు, నలుపు రంగుల్లో ఉంది. రెండవది లేతరంగుల్లో ఆకుపచ్చ కలిసిన పసుపుపచ్చగా ఉంది. అవి పెద్ద పక్షులే, కాని పావురం అంత పెద్దవి కావు.

“కాకిని ఎందుకు తరుముతున్నారు?” తటపటాయిస్తూనే అడిగాను.

జవాబు లేదు.

ఇక జవాబు రాదు అనుకుంటూ ఉండగా లేత రంగులో పిట్ట మెల్లగా జవాబు చెప్పింది, “నేను అమ్మ వంగపండుని, ఇది నాన్న వంగపండు. ఇది మా మొదటి సంతానం.”

“అలాగా,” నేను అన్నాను. “కానీ మీ పిల్లలు ఎక్కడ?”

మళ్లీ జవాబు లేదు.

అప్పుడు నాకు కనపడింది ఒక పిల్ల! పొదలోంచి బయటకు రావటానికి అది ఎంతో కష్టపడుతోంది. దాని తల మురికిగా ఉంది, పొట్టి తోక ఉంది. కొంచెం అమ్మ వంగపండు మాదిరి ఉంది. “ఇదే వాటి తొలి సంతానం అయి ఉంటుంది,” నేను ఉత్సాహంగా అరిచాను.

తన పిల్లను నేను చూశానని అమ్మ వంగపండుకి అర్థమయ్యింది.





“అవును, అది మా పిల్ల. చెట్టు పైన గూడులో మరొకటి ఉంది,” అమ్మ అంది.

“పైన ఎక్కడ?”

శిస్సూ చెట్టు పైన ఉన్న గూటిదగ్గరికి నాన్న వంగపండు ఎగిరింది.

గూడు నిజంగానే చాలా పైన ఉంది! ఎంత వెదికినా అది నాకు కనపడి ఉండేది కాదు.

బైనాక్యులర్స్ తీసుకురానందుకు నన్ను నేను తిట్టుకుని కళ్లు చికిలించి చూశాను. చాలా పైన ఉన్న పంగచీలిన కొమ్మలో ఆ గూడు ఉంది. అది

ఎండుగడ్డితో చేసిన చిన్న ఉయ్యాల మాదిరి ఉంది. గడ్డితోపాటు ప్లాస్టిక్ సంచి కూడా ఉండటం చిత్రంగా అనిపించింది. పక్షులు ప్లాస్టిక్‌ని వాడటం వింతగా ఉంది. ఆశ్చర్యంగా చూస్తూ నిలుచుండిపోయాను.

"ఏయ్! నీ పిల్లకు ఎగరటం రాదు! అది దూకుతోంది, లేదు గెంతుతోంది, కాదు ఎక్కుతోంది. ఏమో! కానీ... కానీ..."

నేను వాక్యం పూర్తి చేసేలోపల అమ్మ వంగపండు ఎంతో గర్వంగా ముఖం పెట్టి, "అది పడిపోయింది," అంది.

"ఏమిటీ!" నా మాటనిండా భయాందోళనలు.





నా స్మృతులు ఒక సంవత్సరం వెనక్కి వెళ్లాయి... చెట్టు మీద నుంచి పడి చెయ్యి విరగ్గొట్టుకున్నాను! ఆ బాధ వర్ణనాతీతం. “దాని చెయ్యిగానీ విరిగిందేమో చూశావా...”

“నీ అనుమానం దాని రెక్క విరిగిందేమోనని. లేదు, ఏమీ విరగలేదు. అది గూడు నుంచి ఎగరవలసిన రోజు ఇది. కానీ పడిపోయింది. అయినా నేర్చుకుంటుందిలే. గూడు వదలటానికి చాలా రోజుల ముందునుంచే పక్షి పిల్లలు రెక్కలు ఆర్చడం నేర్చుకుంటాయి. కాబట్టి అవి పడినప్పుడు పెద్దగా దెబ్బతగలదు.”

“కానీ... పిల్లలు పైనుంచి పడిపోతూ ఉంటే అంతపైన గూడు ఎందుకు



కట్టుకుంటారు? గూడు ఇంకా కింద, చాలా, చాలా కింద కట్టుకోవచ్చు కదా?”

వాటి గూడు చాలా పొడవాటి చెట్టు మీద ఉంది. నేను పడిన ఎత్తు కంటే ఆ చెట్టు మూడింతలు ఉంది. అమ్మ వంగపండు మనసారా నవ్వింది. “ఏమంటే... మేం ఎత్తయిన చెట్లలో ఉండే పక్షులం. మేం నేలమీద ఎప్పుడూ కనపడం. మాకు పళ్లు, తేనె అంటే ఇష్టం. మేం ఉండే ఎత్తైన చెట్లలో ఇవి దండిగా దొరుకుతాయి. సౌకర్యంగా ఉండి, ఎటువంటి భయంలేని ప్రదేశంలో మేం గూడు కట్టుకుంటాం. గూడు కట్టుకోటానికి మేం దక్షిణాది నుంచి ఉత్తరదేశానికి వస్తామని నీకు తెలుసా? మా పిల్లలకు వేడి వాతావరణం కావాలి.”



మరోసారి గూడు చూడటానికి తల తిప్పాను. పైన ఏదో కదలిక కనపడింది... అది ఆకుపచ్చగా, బొద్దుగా ఉంది. చాలా ఎత్తున ఉండటంతో ఏమీ స్పష్టంగా కనపడటం లేదు. కాని అది కొన్ని పుల్లల మీద కూర్చున్నట్లు కనిపించింది.

“అది ఎవరు?” నేను అడిగాను.

“అదా! అది ఆకుపచ్చ పావురం. అది కూడా గూడు కడుతోంది,” అమ్మ వంగపండు చెబుతోంది. “ఇంకా కొన్ని చూపిస్తాను ఉండు. మా చెట్టు పక్కన ఉన్న అత్తిచెట్టు కనపడుతోందా? జాగ్రత్తగా చూడు. దాని ఆ చివరన దోనెలాంటి చిన్న గూడు కనపడుతోందా? చాలా చిన్నది.

అది తెల్లవలయపు కంటి పిట్టగూడు. ఆ తరవాత కొమ్మలో కొంచెం పైన మరొక దోనె కనపడుతోందా? అది కొంచెం పెద్దది, మెత్తటి పుల్లలతో చేసింది. అది పిగిలిపిట్ట గూడు. అన్నిటికంటే తక్కువ ఎత్తులో ఉన్న కొమ్మ చూడు. వేలాడుతున్న గూడు కనపడుతోందా? అది తేనెపిట్టది. కుడివైపుకి అడ్డంగా ఉన్న కొమ్మ కనపడుతోందా? దాంట్లో పిల్లలు కూడా కనపడుతుండాలి! అది కర్రెపిట్ట గూడు, దాంట్లో ఉన్నవి దాని పిల్లలు. తరవాత చెట్టుకి వెళ్లు. అది కూడా శిస్సూ చెట్టే. పొడవాటి తోక ఉన్న గోధుమరంగు పిట్ట కనపడుతోందా? అది ప్యారడైజ్ ఫ్లైకాచర్, దాని పక్కన చిన్న...”





"ఆగు! ఆగు! ఏం జరుగుతోంది? ఎన్ని పిట్టలు, ఎన్ని గూళ్లు! నాకు ఎక్కడ చూడాలో కూడా తెలియటం లేదు. నాకు తల తిరిగిపోతోంది! ఇంకా ఏమీ చూప..."

నా మాటను నాన్న వంగపండు మధ్యలోనే తుంచేసింది, "కర్రెపిట్ట గూడు కట్టుకున్న చోటే పక్షులన్నీ గూడు కట్టుకోటానికి ఇష్టపడతాయని చెపుతోంది, అంతే."

"ఎందుకని?"

"ఏముంది, కర్రెపిట్టలు చాలా జాగ్రత్తగా కాపలా కాస్తాయి. తమ గూడు

ఉన్న పరిసరాలను అవి కాపాడతాయి. తమ గుడ్లు, పిల్లల్ని తినటానికి వచ్చే ఎంతటి పెద్ద పక్షినైనా సరే అవి తరిమి, తరిమికొడతాయి. ఆ పరిసరాల్లో కొన్ని పక్షులనే గూడు కట్టుకోటానికి అనుమతిస్తాయి. ఉదాహరణకి, కర్రెపిట్ట గూడు కట్టినచోట నీకు కాకి గూడు కనపడదు.”

కాకిని వంగపండు పిట్టలు తరుముతున్న దృశ్యం నాకు గుర్తుకొచ్చింది. “దీనంతటికీ, కాకులకీ సంబంధం ఏమిటి? మీరు కూడా ఇందాక కాకిని తరుముతున్నారు కదూ!”

“నీను తెలుసుకోవాలనుంటే చెబుతాను...” నిట్టూర్చింది అమ్మ వంగపండు. “కొన్ని పక్షులకు పళ్లు ఇష్టం, కొన్నింటికి తేనె, గింజలు





ఇష్టం. మాలాగా చాలా పక్షులకు పురుగులంటే ఇష్టం. పక్షుల ఆహార అలవాట్లలో ఎంతో తేడా ఉంది. కొన్నింటికి గుడ్లు, పిల్లలు, చిన్న పక్షులంటే ఇష్టం...”

నాకు అర్థమయ్యింది! ఆ కాకి నీ పిల్లను తినటానికి వచ్చిందన్నమాట!”

ఒక్కసారిగా నాకు విషయం అర్థమయ్యి అంతా తేటతెల్లమయ్యింది. కర్రెపిట్టలు ఈ పక్షుల గూళ్లకు రక్షణ ఇస్తాయి. అయితే పక్షులు ఎల్లప్పుడూ వాటిమీదే ఆధారపడలేవు. వాటి వంతు కర్తవ్యం అవి చెయ్యాలి. నేను చూసిన దృశ్యం అదే.

***

## పాత్రలను కలుసుకోండి

దక్షిణ ఢిల్లీలోని అటవీప్రాంతంలో సంజయ్ వన్‌లో 2010 మే - ఆగస్టు నెలల మధ్య పరిశీలనల ఆధారంగా రాసిన కథ. వంగపండు మే 30న గూడు కట్టటం మొదలుపెట్టింది. జులై 11న గూడును పిల్ల వదిలి పెట్టింది.

పక్షుల, గూళ్ల వాస్తవ పరిణామాన్ని ఈ పుస్తకంలోని ఫోటోలు చూపకపోవచ్చు.





తొలి సంతానం



నాన్న వంగపండు



అమ్మ వంగపండు



ఆకుపచ్చ పావురం



తెల్లవలయపుకంటి పిట్ట



ఎర్రముడ్డి పిగిలి పిట్ట



పిగిలి పిట్ట పిల్ల



గూటిలో అమ్మ తేనెపిట్ట



నాన్న తేనెపిట్ట



కర్రెపిట్ట



అమ్మ ప్యారడైజ్ ఫ్లైకాచర్



నాన్న ప్యారడైజ్ ఫ్లైకాచర్

BIRDS OF DIFFERENT FEATHERS published by VIDYA ONLINE is licensed under a Creative Commons Attribution-NonCommercial-ShareAlike 3.0 Unported License (http://creativecommons.org/licenses/by-nc-sa/3.0/)
Permissions beyond the scope of this license may be available at admin@vidyaonline.org

http://vidyaonline.net